# లక్ష్మీ కటాక్షం

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తీసిన భాస్కరాంబ ఎదురుగా నిలబడివున్న కొడుకుని చూసి ఆనందంగా పలకరించబోతూ, వెనకగా పంజాబీ డ్రెస్సులో ఉన్న అమ్మాయిని గమనించి ఆశ్చర్యంతో మాటలు ఆపేసింది. ఏదో ఆలోచిస్తూనే పక్కకు జరిగేసరికి...వాళ్ళిద్దరూ సూట్ కేసులతో లోపలకు వచ్చారు.

కొడుకు పెళ్ళి చేసుకుని వచ్చాడా...?! ఈ ఆలోచన రాగానే నిస్సత్తువ ఆవరించినట్లయి..ఆ ముందు గదిలో ఉన్న కుర్చీలో కూర్చుండిపోయింది. షాక్ తగిలినట్లుగా బిగుసుకుపోయిన ఆమె కాళ్ళ దగ్గిర వాళ్ళిద్దరూ నేలమీద చతికిలబడ్డారు.

ఉదయ్ ఆమె కాళ్ళపై చేతులు ఉంచి " ఇలా చేసినందుకు మన్నించమ్మా..." అన్నాడు. ఆమె ఇంకా అయోమయంలో ఉంది.

రెండు నెలలక్రితం ఉదయ్ ని ఆఫీసువాళ్ళు ఏదో ట్రైనింగుకని ఉత్తరాదివేపు ఏదో ఊరుకు పంపించటం జరిగింది. ఈ వేళో, రేపోగానీ వచ్చేస్తానంటూ కబురు చేస్తాడేమో అని తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఇంతలో కొడుకు జంటగా వచ్చేసరికి తల్లికి నోటమాట రానట్లుగా చూస్తుండిపోయింది. అపుడే ఉదయ్ తండ్రి కుటుంబరావు బయటనుండి వచ్చాడు. అందరూ అలా నిశ్శబ్దంగా కూర్చోవటం, ఎవరో కొత్తమ్మాయి ఉండటం చూసి, విషయం ఏమిటన్నట్లుగా చూపులతోనే ప్రశ్నించాడు.

ఉదయ్ చటుక్కున లేచి కొంచెం దూరంలో ఉన్న మరో కుర్చీని తెచ్చి తల్లి పక్కనే వేసాడు తండ్రి కూర్చోవటానికి. అతను కూర్చున్నాక భాస్కరాంబ కొంచెం కోపంగా కొడుకు వైపు చూసింది.

ఉదయ్ నిట్టూర్చాడు.

తల్లిదండ్రులిద్దరి వైపూ చూస్తూ మెల్లగా చెప్పాడు " నిజమే, నేను చేసింది పెద్దతప్పే. కాకపోతే ముందు కొంచెం కోపం వచ్చినా, నేను చేసిన పనిని మన్నించగలరనే నమ్మకం ఉంది...అందుకే ఈ ధైర్యం చేసాను ! కనిపెంచి పెద్ద చేసిన కన్నవాళ్ళకు తెలియపరచకుండా, అనుమతి తీసుకోకుండా స్వతంత్రించి పెళ్ళి చేసుకోవటం నిజంగా తప్పే. అయితే...మీ ఇద్దరిగురించీ నాకు బాగా తెలుసుకనకే నా తప్పును క్షమించగలరనే ధైర్యం కలిగింది..! అందుకే, ఇలా చేయగలిగాను ! వీళ్ళేమో అటు మూల, మనం ఈ చివరా ఉంటున్నామా...మా

ఇష్టం గురించి చెబితే, రెండు కుటుంబాల పెద్దలూ మాటలూ సంప్రదాయాలంటూ తిరగాల్సి రావటం, పెళ్ళి తంతుకి ఏవో ఖర్చులు పెట్టటం...ఇదంతా అనవసరంకదా అనిపించింది...అంతే...! "

అలా ఉదయ్ చెబుతూండగానే ఆ అమ్మాయి అడ్డం వచ్చి " అవునండీ...మీరు ఎవరూ లేకుండా మా షాదీ జరగటం మా వాళ్ళకీ ఇష్టం లేదు. అయినా మీ అబ్బాయే కుంటుంబ సన్యాసం కోసమంటూ పట్టుబట్టారు..! " అంది మెల్లని స్వరంతో.

ఉదయ్ ఆ అమ్మాయి వైపు చురుగ్గా చూసాడు. తర్వాత నవ్వు మొహంతో ' సన్యాసం కాదు, శ్రేయస్సు !' ముందు తెలుగు బాగా నేర్చుకో...తర్వాత అలాంటి ప్రయోగాలు చేద్దువుగానీ...! అంతవరకూ పెద్ద పెద్ద మాటల జోలికి వెళ్ళకు..! " అన్నాడు మందలింపు ధోరణిలో.

అయోమయంగా చూస్తున్న తల్లిదండ్రులిద్దరి మొహాల్లోనూ చిన్న దరహాసం వచ్చేసరికి ఉదయ్ కొంచెం హుషారుగా వివరాలు మొదలుపెట్టి చెప్పేశాడు.

" మా ట్రైనింగులో ఒకబ్బాయి వేరేచోటనుండి వచ్చినవాడు...నాకు బాగా దగ్గిర ఫ్రెండయ్యాడు. వాళ్ళ బంధువులున్నారక్కడ అంటూ ఒకసారి నన్ను వెంటబెట్టుకుని తీసుకువెళ్ళాడు వీళ్ళింటికి. మన తెలుగువాళ్ళే కానీ...ఎప్పటినుండో అటు స్థిరపడిపోవటంతో తెలుగు అంత బాగా రాదు. అయితే, వీళ్ళ తాతగారికి మాత్రం బాగా వచ్చు. చాలా గ్రంధాలు చదివారు. ఎన్నో విషయాలు చక్కగా వివరించేవారు. అందుకే నేనూ తరచూ వీళ్ళింటికి వెళ్తూండేవాడిని. అపుడే మా ఇద్దరికీ పరిచయం పెరిగి స్నేహం కలిసింది. తనకీ తెలుగంటే ఇష్టం ఉండటంతో, మాతో మాట్లాడుతూ చాలావరకూ నేర్చేసుకుంది. పేరు లక్ష్మీ బాంధవి. వాళ్ళ తాతగారే ఆ పేరు పెట్టారట. మా ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టమని తెలుసుకున్నాక...ట్రైనింగు పూర్తయి ఇంటికి బయలుదేరి వచ్చే సమయంలో పెళ్ళి జరిగిపోవటం బావుంటుందని చెప్పి వాళ్ళను ఒప్పించాను. మనం, వాళ్ళు వీలుచూసుకుని ఒకసారి అందరం కలుద్దాం..! " అంటూ చెప్పటం ముగించిన ఉదయ్, లోపల గదినుండి బయటకు వచ్చిన తమ్ముడు ఆనంద్ ని చూసి..." వదినను వంటగదిలోకి తీసుకువెళ్ళు. అందరికీ కాఫీ కలిపి తెస్తుంది...! " అన్నాడు.

ఆ అమ్మాయి చటుక్కున లేచి వంటగదిలోకి వెళ్ళింది.

విషయాన్ని వెంటనే అర్ధం చేసుకున్న ఆనంద్ ఒక క్షణం అన్న వైపు విస్మయంగా చూసి, తర్వాత చిరునవ్వుతో లోపలకి వెళ్ళాడు.

అమ్మాయి అటు వెళ్ళగానే భాస్కరాంబ కొడుకు వైపు నిరసనగా చూస్తూ తన అసంతృప్తి వెళ్ళగ్రక్కింది.

" ఇక్కడ...మీ మావయ్యతో పెళ్ళి మాటలు జరుగుతున్నాయని నీకూ తెలిసిందేగా. నిన్ను అల్లుడిగా చేసుకోవాలని మా అన్నయ్యా, మేనకోడలే ఈ ఇంటికి పెద్దకోడలుగా వస్తుందని నేనూ ఎంత ఆశపడ్డామో...! మీ మావయ్య ఈ పెళ్ళి నిశ్చయమైపోయినట్లేనని తన ఆస్తిపాస్తులన్నీ చాలావరకూ కూతురి పేరిట రాసేశాడు కూడా ! నువ్వేమో...చివరకు ఇలా చేసుకువచ్చావ్ ! ఎన్ని కలలు కన్నానో...నీ పెళ్ళి అయ్యాక కొత్త ఫ్లాటు కొని గృహప్రవేశం గ్రాండ్ గా చేసుకోవాలనీ....హు..." అంటూ నిట్టూర్చి " ఇపుడు కోడలు పిల్ల నాలుగు జతల బట్టలతో...ఈ అద్దె కొంపలోకి ప్రవేశం చేసేసింది ! " అంది దీర్ఘం తీస్తూ.

ఉదయ్ తల్లి చేయి పట్టుకుని అనునయంగా అన్నాడు " అమ్మా...నువ్వూ, మావయ్యా మా పెళ్ళి విషయంగా ఇష్టపడ్డారుగానీ, మా ఇద్దరికీ మాత్రం అటువంటి ఆలోచన లేనేలేదు ! మామయ్య ఏమనుకుంటాడోననే ఆలోచన పెట్టుకోకు. చక్కగా మంచి సంబంధం చూసి ఘనంగా కూతురికి పెళ్ళి చేసేస్తాడు ! "

" అవును...అలాగే జరుగుతుందని నాకూ తెలుసులే. లక్ష్మి అనుగ్రహం ఉన్నవాళ్ళకు లోటేమిటీ...! మనకే...పేరులో మాత్రమే లక్ష్మి దేవి ఉంది ! కటాక్షం మాత్రం లేదు ! " అంటూ ఆవిడ బరువుగా నిట్టూర్చింది.

" అమ్మా...అలా ఎందుకనుకుంటున్నావ్...మేం ఇద్దరం ఉద్యోగాలు చేస్తాం...ఆర్థికంగా మన కుటుంబాన్ని ఇంకో మెట్టు పైకి తీసుకెళ్ళగలం ! ఒక్కొక్కరిలో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది ! తనలోని ఆ ప్రత్యేకతల్ని చూసాకనే నాకూ తన పట్ల ఇష్టం పెరిగింది ! " అన్నాడు.

" ఏం ఉద్యోగం చేస్తోందీ...?" ఆసక్తిగా అడిగింది భాస్కరాంబ.

" అక్కడ....పిల్లలకి ట్రైనింగు ఇచ్చేదేదోలే. రిజైన్ చేసేసింది..ఇపుడేదో పరీక్షలకి ప్రిపేరవుతుంది. అది పూర్తయితే మంచిదే వస్తుంది. ఇటుపేపు...ఇక్కడే ఏదో చూసుకోవచ్చు...!"

కొడుకు మాటలకు భాస్కరాంబ మళ్ళీ నిరసనగా చూసింది. " అంటే...వంటా వార్పూ పని లేకుండా ...ఇంకా చదువు సాగిస్తుందా..సరేలే.." అంది కొంచెం ఎగతాళిగా.

“ అమ్మా…లక్ష్మి గురించి నీకు పూర్తిగా తెలియదు. తనకెంత ధైర్యం ఉందో తెలుసా…ఒకసారి ఏం జరిగిందంటే…” అంటూ ఉదయ్ ఉత్సాహంగా చెప్పబోతోంటే, ఆవిడ తన ధోరణిలో దురుసుగా అంది…” చాల్లేరా…ఆడదానికి ధైర్యం, సాహసం ఎందుకూ…నువ్వు మురిసిపోతున్నావ్ గానీ ! “ రుసరుసలాడింది.

“ అదేమిటమ్మా అలా అంటున్నావ్…ఈ రోజుల్లో వంటా వార్పూ చూసుకుంటూ ఆడవాళ్ళు ఇంటికే పరిమితమైపోవటం లేదుగా..అన్ని రకాల ఉద్యోగాలూ చేస్తున్నారు. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళి పనులూ చక్కబెడుతున్నారు ! అలాంటపుడు వాళ్ళకీ తెగువ అవసరమే కదా.?” అనడిగాడు ఉదయ్.

కుటుంబరావు అవునన్నట్లుగా చిరునవ్వుతో చూశాడు.

వంటగదిలో నుండి కోడలూ, చిన్న కొడుకూ కలిసి కబుర్లు చెప్పుకోవటం, నవ్వులూ వినిపించేసరికి కుటుంబరావు అటువేపు చూస్తూ నవ్వు మొహంతో అన్నాడు “ చూడు…కోడలు ఇంట్లోకి అడుగు పెట్టగానే .ఎంత సందడిగా ఉందో..కలుపుగోలు అమ్మాయిలాగే ఉంది ! “

భాస్కరాంబ కొంచెం చిరచిరలాడింది. “ మీకు మొదటినుండీ మావాళ్ళ సంబంధం ఇష్టం లేనట్లు అంటీ ముట్టనట్లుండిపోయారు ! ఇపుడు కొడుకు ఇలా చేసుకువచ్చేసరికి మీకు సంతోషంగా ఉన్నట్లుంది..అందుకే అలా మెచ్చేసుకుంటున్నారు ! నాకు నచ్చటం ఎందుకూ..! వాడి గురించే నా తపన ! లక్ష్మీ కటాక్షం లేదని బాధ…అంతే..! “ అంది బొంగురుపోతున్న గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ.

ఇంతలోనే కాఫీ కప్పులతో లోపలనుండి లక్ష్మి వచ్చింది. వెనుకనే ఆనందూ వచ్చాడు. ఆమె అందించిన కప్పును నోటి దగ్గర పెట్టుకున్న కుటుంబరావు “ కాఫీ చాలా బావుందమ్మా…” అన్నాడు ప్రశంసగా చూసి.

లక్ష్మి సరదాగా నవ్వి “ అది కాఫీ కాదు మావయ్యా…టీ..! “ అంది.

ఆయన వెంటనే “ అవునా…నేనెప్పుడూ టీ తాగనమ్మా. అయితే రేపటినుండీ ఇలా చేసి ఇస్తే…ఇదే ఇష్టంగా తాగుతా…! “ అన్నాడు.

ఉదయ్ వెంటనే తండ్రివైపు చూసి “ ఏంటి నాన్నా…ఏం చెబితే, అది నమ్మటమేనా ? తను తమాషా చేస్తోంది..అది కాఫీనే..వాళ్ళింట్లోవాళ్ళు ఎక్కడినుండో కాఫీ గింజలు తెప్పించి పొడి తయారుచేస్తారట. అది తెచ్చినట్లుంది..దాంతో కాఫీ కలపటం వల్ల రుచి కొంచెం కొత్తగా అనిపించి ఉంటుందంతే..! “ అన్నాడు.

" అవునా.." అంటూ ఆయన మళ్ళీ నవ్వాడు. " ఇంట్లో అమ్మాయిలుంటే...ఇలాంటి చమత్కారాలతో నవ్వులకి లోటు ఉండదన్నమాట ! " అంటూ భాస్కరాంబ వైపు చూసి " నువ్వు మనకి అమ్మాయి పుట్టలేదని ఒకటే బాధ పడుతూంటావుగా, ఇక ఆ లోటు తీరిపోయిందిలే..! " సంతోషంగా అన్నాడు.

భాస్కరాంబ మొహం గంటు పెట్టుకునే ఉంది. ఓ క్షణం తర్వాత చిన్నకొడుకుని " ఏరా....ఎపుడూ ఇంట్లో ఉన్నపుడు మౌనంగా మాటలు రానివాడిలా ఉంటావూ....ఈ వేళేమిటీ..అలా వంటగదిలో కబుర్లు చెబుతూ నవ్వేస్తున్నావ్...? " అనడిగింది.

ఆనంద్ చిరునవ్వుతో బదులు చెప్పాడు " అమ్మా...వదిన తెలుగు బాగానే మాట్లాడుతోంది. అయితే అపుడపుడూ కొంచెం హిందీ, ఇంగ్లీషూ కలిపి కలగాపులగం చేసేస్తుంది ! మీతో మాట్లాడుతున్నపుడు మాత్రం ఒక్కోమాట తప్పుగా చెబుతోంది ! బహుశా మిమ్మల్ని నవ్వించటానికేమోనని నా అనుమానం..! " అన్నాడు.

అదేం కాదన్నట్లు లక్ష్మి తలవూపింది.

అందరి పెదవులపైకి వచ్చిన చిరునవ్వుల్ని చూస్తూ " మీరు నవ్వుల్ని దోచిపెట్టకుండా నాకు తప్పుల్ని చెబితే, సరిదిద్దుకుంటాను...! " అంది లక్ష్మి.

దానికి ఉదయ్ నవ్వుతూ " నువ్వు కొంచెం ఆలోచించి మాట్లాడితే సరిపోతుంది ! నవ్వుల్ని దోచి కాదు..దాచి అనాలి ! మా ఆనంద్ అభిప్రాయం నిజమేనేమోననే అనుమానం నాకూ వస్తోంది ! " అన్నాడు.

మళ్ళీ అందరూ చిన్నగా నవ్వారు.

తల్లి కూడా చిరునవ్వు చిందించటాన్ని చూసిన ఉదయ్ వదనం వికసించింది.

జజజజ

ఆ తర్వాత కుటుంబరావు భాస్కరాంబకు ఎన్నో విధాల నచ్చచెప్పాడు.

" మన వాడిని తప్పు పట్టుకోవటానికి ఏమీ లేదు. వాడు నాకు ఆ అమ్మాయిని ఇష్టపడుతున్నట్లు చెప్పి, రిజిష్టర్ మ్యారేజి చేసుకోవాలనుకుంటున్నట్లు అన్నాడు. కారణం ఏమిటో అపుడే నాకు అర్థమైంది.

అసలు తన పెళ్ళి విషయం ముందుగా నీకే చెప్పమన్నాడు. కానీ నేనే అవసరం లేదని నచ్చచెప్పాను. వాడు చాలా దూరం ఆలోచించి తీసుకున్న నిర్ణయం నాకూ సబబే అనిపించింది. నీకు ముందుగా తెలిస్తే

ఏముందీ...ఏడుపులూ, పెడబొబ్బలూ..చచ్చిపోవటమనే బెదిరింపులూ మొదలయ్యేవి. పెళ్ళి ఆర్భాటాల కోసం మనకున్న కాస్త భూమినీ అమ్మేయాలని తీర్మానించావు. ఇలా గొప్పలకి పోయి అప్పులు చేసే తిప్పలు లేకుండా ఈ విధంగా ఆలోచించాడన్నమాట !

వాళ్ళదీ , మనదీ ఒకే విధమైన ఆర్థిక పరిస్థితి. మనకి అప్పుల భారం లేకుండా ఇరువురి కుటుంబాల ప్రశాంత జీవనం కోసమే ఇటువంటి నిర్ణయం తీసుకున్నారిద్దరూ. ఆ అమ్మాయి గురించీ కొంచెం ఆలోచించు. తన వాళ్ళందర్నీ వదిలి, వాడిని నమ్మి మన ఇంటికి వచ్చిందా...మనమూ అభిమానం చూపించి, ఆదరంగా చూసుకోవాలి. నాకు మొదటినుండీ మీ అన్నయ్య భేషజం, మన పట్ల ఉండే చిన్నచూపు నచ్చేదికాదు. అయినా నీ పుట్టింటి పట్ల నీకున్న మమకారం గ్రహించి ఎదురు చెప్పలేదు. అయితే మన అబ్బాయి ఎపుడైతే తన నిర్ణయం చెప్పి అనుమతి కోరాడో, అపుడే నేను అన్ని సమస్యలకీ పరిష్కారంగా వాడి నిర్ణయం బావుందనుకున్నాను.

నీకు తనే చెబుతాననంటే...నేనే వద్దన్నాను. నీ నైజం తెలుసుగా, ముందు కొంచెం ఆగ్రహించినా, వెనువెంటనే అనుగ్రహం చూపిస్తావని ! “

ఆ మాటలకు భాస్కరాంబ కొంచెం మెత్తబడినా, ముభావంగానే ఉండిపోయింది.

రోజులు గడుస్తున్నాయి.

కోడలి తప్పుల్ని ఎంచాలనుకున్న భాస్కరాంబకు ఆ అవకాశం దక్కలేదు. పగలు పనులన్నీ పూర్తయ్యాకనే పుస్తకాల్ని చేతబడుతోంది. రాత్రి పూట వెలుగుతున్న లైటును చూసి బాగా పొద్దు పోయేవరకూ చదువుకుంటోందని భాస్కరాంబ గ్రహించింది. అ అమ్మాయి తీరుతెన్నుల్ని గమనించిన భాస్కరాంబ మనసు కోడలిపట్ల అభిమానం కలిగినా పైకి తేలలేదు. తన కూతురితో పాటుగా తన అన్నయ్య ఇవ్వజూపిన కట్నకానుకలే గుర్తుకువస్తూ ఆవిడ మనసులో అసంతృప్తి జ్వాలని చల్లారనివ్వటంలేదు ! అందుకే కోడలు చొరవగా మాటలు కలపబోయినా భాస్కరాంబ ముభావంగా ఉండిపోతోంది.

ఆనంద్ ఇంటరుతో చదువు ఆపేసి టాక్సీ డ్రైవర్ అవతారం ఎత్తాడు. లోను తీసుకుని టాక్సీ కొన్నాడు. కష్టపడి పై చదువులు చదివేకంటే ఇదే బావుంటుందని అనిపించిందతనికి.

లక్ష్మి మాత్రం డిగ్రీ అయినా పూర్తి చేయాల్సిందేనని, అతనిని ప్రైవేటుగా పరీక్ష రాయటానికి ఒప్పించింది. ఆ ఏర్పాట్లన్నీ తనే చూడటమేకాకుండా, అతను ఇంటికి వచ్చిందగ్గరునుండీ...కూడా ఉండి చదువు సంగతి పర్యవేక్షించే బాధ్యతనూ తీసుకుంది !

ఇదంతా చూసినా భాస్కరాంబకు అంత ఆనందం కలగలేదు. ఎన్నాళ్ళకు ఇలా కష్టపడి ఆర్థికంగా పైకెదుగుతారూ అంటూ నిట్టూర్చింది.

ఉదయ్ తన ఆఫీసులో లోను తీసుకుని ఒక లక్ష తమ్ముడికి ఇచ్చాడు...టాక్సీ కోసం బ్యాంకు లోను కాకుండా ప్రైవేటు వ్యక్తుల దగ్గర తీసుకున్న అప్పు తీర్చటానికి.

ఆ మరునాడే ఉదయ్ ఆఫీసుపనిమీద పొరుగూరుకి వెళ్ళాడు.

కుటుంబరావు వారం రోజులుగా కాలికి దెబ్బ తగిలి కొంచెంగా ఫ్రాక్చర్ కావటంతో ఇంట్లోనే బెడ్ మీద ఉంటున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో ఆనంద్ టాక్సీ ఎక్కిన నలుగురు ఆగంతకులు డబ్బు కోసం అతన్ని బెదిరించి, దగ్గరున్న కొద్దిపాటి మొత్తమూ లాక్కుని, ఇంటిదగ్గరున్న డబ్బు కూడా తెప్పించి ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించి....ఇంటికి ఫోను చేయించటంతో భాస్కరాంబకు ఏమీ పాలుపోక భయంతో కొడుకు గురించి రాగాలు పెట్టింది.

ఆ సమయంలో...లక్ష్మి భాస్కరాంబకు ధైర్యం చెప్పి " ఈ విషయం మావయ్యగారికి చెప్పకండి. అనవసరంగా కంగారుపడతారు...ఈ పరిస్థితుల్లో వెళ్ళలేకపోయినందుకు బాధపడతారుకూడా. నేను చూస్తానులెండి. వాళ్ళు కోరినట్లు డబ్బు తీసుకుని బయలుదేరతాను. ఆనంద్ కు ఏమీ హాని తలపెట్టరు...వాళ్ళకు డబ్బే కావాలి..తెస్తానని వాళ్ళిచ్చిన నెంబరుకే ఫోన్ చేసి చెప్పాను.." అంది.

భాస్కరాంబ నిర్ఘాంతపోయింది. " సరిగ్గా ఇపుడే పెద్దబ్బాయి ఇంట్లో లేడు..మీ మావగారిదేమో కదలకూడని స్థితి. నువెళ్ళి ఏం చేస్తావమ్మా...నాకు భయంగా ఉంది..వద్దు...ఇంకో మార్గం ఏదైనా ఆలోచిద్దాం...నువ్వు వెళ్ళటానికి ఒప్పుకోను ! " ఖచ్చితమన్నట్లుగా చెప్పింది.

" మీరలా టెంటేలు పడకండి. ఏం ఫర్వాలేదు..." అంటూ నచ్చచెప్పిన లక్ష్మి తన గదిలోకి వెళ్ళి దేనికోసమో వెతుకుతూంటే....ఏం కావాలని భాస్కరాంబ అడిగింది.

“ ఏం లేదు...బట్టలు మార్చుకోవాలనుకుంటున్నాను...” అనేసరికి భాస్కరాంబ గదిలోనుండి బయటకు వచ్చేసింది. మనసులో మాత్రం...ఇంత కంగారు సమయంలో బట్టలు మార్చుకోవాలనే ఆలోచన ఏమిటో అనుకుంటూ నిష్టూరపడింది.

రెండు క్షణాలలో తయారై వచ్చిన లక్ష్మి, డబ్బు పెట్టిన బ్యాగు తీసుకుని అత్తగారికి మరోసారి భయపడొద్దని ధైర్యం చెప్పి బండి మీద దూసుకుపోయింది.

ఏం చేయాలో తోచక, స్థిమితంగానూ ఉండలేక, భాస్కరాంబ ఇంట్లోకీ, గుమ్మం దగ్గరకు తిరుగుతూ ఆందోళనతో ఎదురు చూస్తూ ఉండిపోయింది.

రెండు మూడు గంటల తర్వాత టాక్సీ లోంచి దిగిన ఆనంద్ నూ, వెనకనే బండి మీద వచ్చిన కోడలును చూశాకనే ఆమెకు ప్రాణం వచ్చింది !

లోపలకు వచ్చిన ఆనంద్ తల్లికి జరిగిందంతా సంతోషంగా వివరించాడు. “ అమ్మా...వదిన చాలా తెలివిగా ప్రవర్తించటంవలన నేనీ రోజు ప్రాణాలతో బయటపడ్డాను. వాళ్ళు ఊరవతల ఏదో తోటలోకి తీసుకెళ్ళి కట్టిపడేసి కాపలా ఉండి, ఇంటికి డబ్బు కోసం నాచేత ఫోను చేయించారు. వదిన ఒక్కతే రావటం చుసి వాళ్ళు ప్రమాదం లేదని స్థిమితపడ్డారు. కొంచెం దూరం నుండే వాళ్ళకు డబ్బు సంచీ చూపించేసరికి, ఆపద లేదనుకుని సంచీ తీసుకోవటానికి వాళ్ళే కదిలివచ్చారు. ఆ సమయం చూసి వదిన తన డ్రెస్సులో దాచిన రైఫిల్ తీసి వాళ్ళ కాళ్ళమీద షూట్ చేసింది. వేరే మార్గం ద్వారా వచ్చిన పోలీసులు చెట్లచాటున నక్కి ఉన్నవాళ్ళు అదను చూసి వాళ్ళను అరెస్టు చేశారు ! మనింట్లో డబ్బు ఉందని మనకు బాగా తెలిసిన వాళ్ళే ఈ పని చేయించి ఉంటారని పోలీసులు అన్నారు. ఆ విషయాలన్నీ వాకబు చేసి తెలుసుకునే పని వాళ్ళదేననుకో. దారిలోనే వదిన ఈ కిడ్నాపర్లకు ఫోన్ చేసి రావాల్సిన మార్గం తెలుసుకుంటున్నట్లుగా మాట్లాడుతూనే...ఆ విషయాలన్నీ పోలీసులకూ తెలిసేలా చేయటం వలన వాళ్ళకు ఆ కిడ్నాపర్లను అరెస్టు చేయటం సులువైందని వదినను బాగా అభినందించారు.

వదిన నేషనల్ లెవల్ లో బెస్ట్ రైఫిల్ షూటర్ గా అవార్డు కూడా అందుకుందట అమ్మా. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విధానాలనే అక్కడ ట్రైనింగ్ ఇచ్చే ఉద్యోగమే చేసేదట కూడా !”

ఆనంద్ చెప్పిన మాటలన్నీ కళ్ళు పెద్దవి చేసుకుని సంభ్రమాశ్చర్యాలతో విన్న భాస్కరాంబలో కదలిక వచ్చింది. కోడల్ని రెండు చేతులతో చుట్టేసి ' నువ్వు మా ఇంటి అదృష్టలక్ష్మివమ్మా ' అంటూ కన్నీళ్ళు కార్చింది.

అపుడే మనసులో పశ్చాత్తాపపడింది కూడా. లక్ష్మీ దేవి కటాక్షం లేదని అనుకుందిగానీ అది ఎంత పొరపాటో ఆమెకు అపుడే తెలిసివచ్చింది ! లక్ష్మీదేవి కటాక్షం రకరకాలుగా ఉంటుంది...అవును...కేవలం కట్నకానుకలతో కోడలు వస్తేనే లక్ష్మీ కటాక్షం కలిగినట్లుగా తను భ్రమపడింది. మంచి గుణగణాలు, ధైర్యం, చదువు....ఇవన్నీ కూడా లక్ష్మీ రూపాలేగా అనే జ్ఞానం లేక కోడలను ఇన్నాళ్ళూ చిన్నచూపు చూసింది. ఈ అనుభవం ద్వారా తనకు ఇపుడు అదెంత తెలివితక్కువ ఆలోచనో ఆవిడకు తెలిసివచ్చింది ! కోడలు సమయస్ఫూర్తి వలన తమ కుటుంబానికి కలిగిన ఆపద ఎలా తేలికగా తప్పిందో భర్తకు వివరించటానికి కుటుంబరావు పడుకుని ఉన్న గదిలోకి ఆనందంగా అడుగు పెట్టింది.